సాక్షి
హనుమకొండ

శుక్రవారం । 7 । జూలై । 2023



టమాటాల చోరీపై విచారణ

డోర్నకల్‌లోని కూరగాయల మార్కెట్‌లో టమాటాలు, పచ్చి మిర్చి చోరీపై పోలీసులు గురువారం విచారణ చేపట్టారు. - IIలో▸



దేశానికి ఎన్‌సీసీ సేవలు అవసరం

ఎన్‌సీసీ కేడెట్ల సేవలు దేశ భద్రతకు ఎంతో అవసరమని ఎన్‌సీసీ బెటాలియన్ గ్రూప్ కమాండెంట్, కల్నల్ హెచ్‌వీ దూబే అన్నారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం
$32^0/24^0$

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడుతుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

10 నుంచి రేషన్ బియ్యం పంపిణీ

హన్మకొండ అర్బన్: ఈనెల 10వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాలతో ఈనెల బియ్యం పంపిణీ ఆలస్యమైందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆమె సూచించారు.

డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా హనుమంతు



హన్మకొండ: హనుమకొండ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా వి.హనుమంతు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన బి.నంద హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. మహబూబ్‌నగర్‌లో అసిస్టెంట్ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న వి.హనుమంతుకు పదోన్నతి కల్పించారు. హనుమకొండ డివిజన్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.హరికృష్ణ, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

హిందీలోనే మాట్లాడుకుందాం

నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ



కాజీపేట అర్బన్: 'నిట్ వరంగల్ క్యాంపస్‌లో అధికార భాష హిందీలోనే మాట్లాడుకుందాం' అని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. నిట్ వరంగల్‌లోని బోస్ సెమినార్ హాల్‌లో గురువారం నిట్‌లో హిందీ భాష ప్రాముఖ్యాన్ని పెంచేందుకు 'స్వచ్ఛభారత్ అభియాన్' అంశంపై ఏర్పాటు చేసిన సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి బిద్యాధర్ సుబుదీ మాట్లాడారు. ప్లాస్టిక్ రహితంగా నిట్‌ను తీర్చిదిద్దేందుకు స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో హిందీ ఆఫీసర్ ఆదేశ్ శ్రీవాస్తవ, ప్రొఫెసర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


176 మంది టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్

- విద్యార్థులు తక్కువగా ఉండి టీచర్లు ఎక్కువుంటే..
- అవసరం ఉన్న పాఠశాలలకు సర్దుబాటు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి 449 ఉండగా.. మరికొన్ని ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. వివిధ పాఠశాలల్లో కొన్నింట్లో టీచర్లు తక్కువగా ఉండి విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. మరికొన్నింట్లో టీచర్లు ఎక్కువుండి విద్యార్థులు తక్కువగా ఉన్నారు. టీచర్ల కొరత సమస్యను పరిష్కరించేందుకు ఆయా మండలాల్లోని పాఠశాలల్లో పరిస్థితులను బట్టి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేసుకోవాలని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై 14 మండలాల ఎంఈఓలను ఇటీవల ఆదేశించారు. దీంతో ఎంఈఓలు అవసరం ఉన్న పాఠశాలలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేస్తూ ఆయా ఉపాధ్యాయులకు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. అలా.. జిల్లాలో 176 మంది ఉపాధ్యాయులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద అవసరం ఉన్న పాఠశాలలకు పంపారు. హనుమకొండ మండలంలో 36 మందిని వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద పలు పాఠశాలలకు అడ్జెస్ట్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఎక్కువ శాతం వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ఏ మండలంలోని వారికి ఆ మండలంలోని ఉపాధ్యాయులనే అడ్జెస్ట్ చేశారు. కొందరు స్కూల్ అసిస్టెంట్లను మాత్రం ఇతర మండలాల నుంచి హనుమకొండలోని పలు హైస్కూళ్లలోకి పంపుతూ ఉత్తర్వులిచ్చారు. అయినప్పటికీ ఇంకా కొన్ని హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నట్లుగా తెలుస్తోంది. గత రెండ్రోజులుగా ఆయా ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరుతున్నారు. జీరో స్ట్రెంత్ ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులను కూడా అవసరం ఉన్నచోటకు పంపారు.

ఖాకీల నీడలో మహానగరం!

ప్రధాని మోదీ సభ కోసం 10వేల మందితో బందోబస్తు



- వరంగల్ నగరంలో అమల్లోకి ట్రాఫిక్ ఆంక్షలు
- 'నో ఫ్లైజోన్'లుగా వరంగల్, హనుమకొండ ప్రాంతాలు.. 144 సెక్షన్
- ఇక్కడే మకాం వేసిన కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్‌లు
- పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష
- సభావేదిక ఏర్పాట్లను పరిశీలించిన బీజేపీ నేతలు
- జన సమీకరణకు ఇన్‌చార్జ్‌ల నియామకం

సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా వరంగల్ మహానగరం పోలీసులమయమైంది. దేశ ప్రధాని సుమారు 30ఏళ్ల తర్వాత ఓరుగల్లులో పర్యటిస్తున్నందున కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారులు స్థానిక పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ నివేదికలు పంపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్‌లు.. పోలీసు ఉన్నతాధికారులు, కలెక్టర్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అలర్ట్ చేస్తున్నారు. రెండు రోజుల కిందటే భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఢిల్లీ నుంచి స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూపు (ఎస్‌పీజీ) డీఐజీ నవనీత్ కుమార్ మెహతా ఆధ్వర్యంలో మూడు బృందాలు హనుమకొండకు చేరుకున్నాయి. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషనల్ డీజీపీ విజయ్ ఆధ్వర్యంలో డీఐజీలు, సీపీలు, ఎస్పీలు, ఏఎస్పీ స్థాయి అధికారులతో గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సమీక్ష జరిపారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఇప్పటికే పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ నగరంలో దారి మళ్లింపు వివరాలను ప్రకటించారు.

పారా గ్లైడర్లు, మైక్రోఎయిర్ క్రాఫ్ట్‌ల ఎగురవేత నిషేధం...

భద్రత రీత్యా వరంగల్, హనుమకొండ ప్రాంతాలను 'నో ఫ్లైజోన్'లుగా ప్రకటించిన అధికారులు144 సెక్షన్‌తోపాటు పోలీసు నిషేధాజ్ఞలను అమల్లోకి తెచ్చారు. గురువారం నుంచి 8వ తేదీ వరకు వరంగల్, హనుమకొండ నగరానికి 20 కిలో మీటర్ల వ్యాసార్థంలోని గగనతలంలో డ్రోన్‌లు, రిమోట్ కంట్రోల్‌తో పని చేసే మైక్రో లైట్ ఎయిర్ క్రాఫ్ట్, పారాగ్లైడర్ వంటివి ఎగురవేయడం పూర్తిగా నిషేధం. ఎవరైనా వ్యక్తులుగానీ, సంస్థలుగానీ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. అదేవిధంగా ట్రై సిటీ పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అనుసరించి గుమిగూడడం, ర్యాలీ, సభలు, సమావేశాలు నిర్వహించడం, మైకులు, స్పీకర్లు ఏర్పాటు చేయడంపై నిషేధం విధించారు. ఈ నిషేధం శుక్రవారం ఉదయం 6గంటల నుంచి 8వ తేదీ సాయంత్రం 6గంటల వరకు అమల్లో ఉంటుంది.

వేదికపై ఎనిమిది మందికి అవకాశం..

హనుమకొండ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానంలో మూడు సభా వేదికలు ఏర్పాటు చేశారు. విజయ సంకల్ప సభకు ముందు ఒక వేదిక నుంచి ప్రధాని మోదీ.. వర్చువల్ ద్వారా వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన చేస్తారు. ఈసందర్భంగా ప్రధానితో సహా ఎనిమిది మందికి ఆ వేదికపై అవకాశం కల్పించారు. గవర్నర్ తమిళి సై, సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు బండి సంజయ్‌కుమార్, పసునూరి దయాకర్ పాల్గొంటారని పీఎంఓ నుంచి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

సభకు జన సమీకరణ..ఇన్‌చార్జ్‌ల నియామకం

మోదీ విజయసంకల్ప బహిరంగ సభను బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సభ సక్సెస్ కోసం భారీ జనసమీకరణలో ఆ పార్టీ నాయకులు నిమగ్నమయ్యారు. పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ గురువారం హనుమకొండకు చేరుకున్నారు. ఆయనతోపాటు స్థానిక నాయకులు సభాస్థలాన్ని పరిశీలించారు. జన సమీకరణకు ప్రతి నియోజకవర్గానికి ఒక ఇన్‌చార్జ్‌ని నియమించి.. వారికే బాధ్యతలు అప్పజెప్పారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని నియోజకవర్గాలకు ఇద్దరికి బాధ్యతలు అప్పగించారు. వారికి కేటాయించిన నియోజకవర్గాలకు వెళ్లి సమీక్ష సమావేశాలను నిర్వహించాలని ఇప్పటికే పార్టీ హైకమాండ్ ఆదేశించింది.

బందోబస్తుపై అడిషనల్ డీజీపీ సమీక్ష..



సమీక్షలో మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ విజయ్, చిత్రంలో సీపీ రంగనాథ్

ప్రధాని పర్యటన నేపథ్యంలో భద్రత ఏర్పాట్లపై గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషనల్ డీజీపీ విజయ్ గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాని పర్యటిస్తున్న ప్రాంతాల్లో చేపట్టిన భద్రత ఏర్పాట్ల వివరాలను వరంగల్ సీపీ రంగనాథ్ అడిషనల్ డీజీపీకి వివరించారు. హెలిపాడ్, రోడ్డు బందోబస్తు, భద్రకాళి దేవాలయం, బహిరంగ సభల వద్ద ఏర్పాటు చేయాల్సిన భద్రతతోపాటు నిర్వహించాల్సిన విధులపై అడిషనల్ డీజీ.. అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఐజీలు సత్యనారాయణరెడ్డి, రమేశ్‌తోపాటు కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఎస్పీలు, ట్రైనీ ఐపీఎస్‌లు పాల్గొన్నారు.



హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో సిద్ధమవుతున్న వేదికలు

ప్రధాని పర్యటన వేళ.. ట్రాఫిక్ మళ్లింపు
- సీపీ ఏవీ.రంగనాథ్

రైల్వే వ్యాగన్ పరిశ్రమ రాష్ట్రానికి తలమానికం
- జిల్లాలో పారిశ్రామిక రంగానికి బాటలు
- దక్షిణ మధ్య రైల్వే జీఎం ఏకే జైన్

ప్రధాని పర్యటనకు శరవేగంగా ఏర్పాట్లు
- విమానాశ్రయంలో నాలుగు హెలికాప్టర్లు ల్యాండింగ్
- హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే

పరిశ్రమల కేంద్రంగా కాజీపేట
- ప్రధాని సభను విజయవంతం చేయాలి
- బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల

- వివరాలు IIలో▸

ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు చేయండి

- కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా
- అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన



రహదారులను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అధికారులు

వరంగల్ అర్బన్: ప్రధాని మోదీ ఈనెల 8న నగరంలో పర్యటించనున్న నేపథ్యంలో విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. నగర వ్యాప్తంగా ప్రధాని మోదీ 27 కిలోమీటర్లు ప్రయాణించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారుల్లో ఇరువైపులా విద్యుత్ తీగలు వేలాడకుండా చూడాలన్నారు. రోడ్లు, సెంట్రల్ మీడియమ్స్ శుభ్రంగా ఉంచాలని, మొక్కలు నాటలన్నారు. భద్రకాళి ఆలయం, ఎయిర్‌పోర్ట్ సభా స్థలాల వద్ద విధులు నిర్వహించే అధికారుల జాబితా సిద్ధం చేయాలన్నారు. చీఫ్ సెక్రటరీ ఆదేశం మేరకు ప్రస్తుతం బల్దియా నిర్వహిస్తున్న పనుల వివరాలు సమర్పించాలని సూచించారు. ప్రధాని పర్యటించే ప్రాంతాల్లో యాంటీ లార్వా యాక్టివిటీస్ జరగాలన్నారు. సభా స్థలి వద్ద లిట్టర్ బిన్‌లు, డస్ట్ బిన్‌ల ఏర్పాటు, మొబైల్ టాయిలెట్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. సభాస్థలి ప్రాంతాల్లో ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు ఇన్‌చార్జ్‌లుగా మానిటరింగ్ చేయాలని, కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కాగా.. కమిషనర్ అధికారులతో కలిసి భద్రకాళి దేవాలయం వద్ద ప్రధాని రోడ్డు మ్యాప్‌ను పరిశీలించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ఆయన వెంట అడిషనల్ కమిషనర్ రవీందర్‌యాదవ్, ఆర్ఎఫ్ఓ పాపయ్య, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీహెంచ్ఓ డాక్టర్ రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, సీహెచ్ఓ శ్రీనివాస్‌రావు, సిటీ ప్లానర్ వెంకన్న, డీఎఫ్ఓ శంకర్, డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, జోనా, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఈఈలు శ్రీనివాస్, రాజయ్య, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాక



హన్మకొండ: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఈనెల 7న హనుమకొండలో పర్యటించనున్నారు. మంత్రి పర్యటన వివరాలను గురువా రం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపా రు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమై తొలిసారిగా నగరానికి వస్తున్న కిషన్‌రెడ్డికి ఉదయం 9 గంటలకు కరుణాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద ఘన స్వాగతం పలుకనున్నట్లు ఆమె తెలిపారు. 10 గంటలకు భద్రకాళి అమ్మవారి ఆలయంలో కిషన్‌రెడ్డి పూజల్లో పాల్గొంటారని, 11 గంటలకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్స్‌లో విలేకరుల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 12:00 గంటలకు ములుగు రోడ్డులోని శివానందమూర్తి ఆశ్రమాన్ని సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 1 గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిట్‌కు చేరుకోనున్నట్లు రావు పద్మ వివరించారు.

ప్రజల చిరకాల వాంఛను కేంద్రం గుర్తించాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

కాజీపేట: వరంగల్ నగర ప్రజల చిరకాల వాంఛను కేంద్ర ప్రభుత్వం గుర్తించి కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ కేంద్రం ఏర్పాటు ప్రకటన చేయాలని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. కాజీపేట 62వ డివిజన్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎంపీ దయాకర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విభజన చట్టాన్ని కేంద్రం గౌరవించాలని హితవు పలికారు. డివిజన్, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్న విషయాన్ని పాలకులు పరిగణనలోకి తీసుకుని నిరుద్యోగ యువత ఆశలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే మరిన్ని పోరాటాలు తప్పవని హెచ్చరించారు. బండా ప్రకాశ్, ఎంపీ దయాకర్ మాట్లాడుతూ.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హడావిడిగా వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటుకు బీజేపీ శ్రీకారం చుట్టిందని విమర్శించారు.

ఏం చేశారని ప్రధాని వస్తున్నారు?

హన్మకొండ: 'ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఏం చేశారని ప్రధాని నగరంలో పర్యటిస్తున్నారు' అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ప్రశ్నించారు. విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా నగరంలో ఎలా పర్యటిస్తారని ప్రశ్నించారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయలేదన్నారు. ఒకసారి పీరియాడిక్ వ్యాగన్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్ అని, ఆతర్వాత వ్యాగర్ రిపేర్ సెంటర్ అని, తాజాగా.. వ్యాగన్ తయారీ పరిశ్రమ అని ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో రైల్వే అభివృద్ధిపై ప్రధానికి చిత్తశుద్ధి లోపించిందని, ఇప్పుడు వారు చేస్తున్నదంతా ఎన్నికల లబ్ధి కోసమేనని చీఫ్‌విప్ వినయ్ విమర్శించారు. విభజన చట్టంలో పొందుపర్చిన హామీలు అమలు చేయాలన్నారు. సమావేశంలో 'కుడా' మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్ సంకు నర్సింగ్, ఆర్టీఏ కమిటీ సభ్యుడు కాటపురం రాజు, జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యులు సుంచు కృష్ణ, నార్లగిరి రమేశ్, ఎండి సోని పాల్గొన్నారు.

రెరా చైర్మన్‌ను కలిసిన మేయర్

వరంగల్ అర్బన్: తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీఎస్ రెరా) చైర్మన్‌గా ఇటీవల నియమితులైన డాక్టర్ సత్యనారాయణను గురువారం హైదరాబాద్‌లో మేయర్ సుధారాణి కలిశారు. ఆయనకు పూల మొక్క అందించారు. శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.



రెరా చైర్మన్ సత్యనారాయణకు పూల మొక్క అందజేస్తున్న మేయర్ సుధారాణి

టీపీబీఓ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- ప్రధాని పర్యటన దృష్ట్యా ట్రాఫిక్ ఆంక్షలు
- అభ్యర్థులు 8 గంటల వరకే కేంద్రాలకు చేరుకోవాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: ఈనెల 8న టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ (టీపీబీఓ) పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. పేపర్ -1 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ -2 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పరీక్షల నిర్వహణ కోసం 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు, ఇందులో 1,734 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఒక్కో కేంద్రానికి ఒక లైజన్ ఆఫీసర్ చొప్పున 8 మంది అధికారులను కేటాయించినట్లు తెలిపారు. జూలై 8న ప్రధాని నరేంద్ర మోదీ జిల్లా పర్యటన దృష్ట్యా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలు అమలులో ఉన్నందున, అభ్యర్థులు ఉదయం 8 గంటల వరకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

టౌన్ ప్లానింగ్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : టీఎస్‌పీఎస్సీ టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత పరీక్ష శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, రెండో విడత పరీక్ష మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 5 సెంటర్లలో 1,219 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. అదేరోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు ఉదయం 7:30 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అంతేకాకుండా బస్సులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లేవిధంగా ఏర్పాట్లు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు. సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఉంటుందని, కరెంటు సరఫరాలో అంతరాయం కలుగకుండా ఎన్పీడీసీఎల్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు, లైజనింగ్ ఆఫీసర్లను నియమించామని, అభ్యర్థులు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు.

10 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

డీఈఓ ఎండీ అబ్దుల్‌హై

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పఠనోత్సవంలో భాగంగా ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు పాఠశాలల్లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించాలని డీఈఓ ఎండీ అబ్దుల్‌హై హెచ్ఎంలను, ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈగ్రంథాలయ వారోత్సవాల నిర్వహణ తీరును తొలిమెట్టు మండల నోడల్ అధికారులు పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు.

కార్యక్రమాలు ఇలా..

- ఈనెల 10న విద్యార్థులకు గ్రంథాలయాలపై అవగాహన కల్పిస్తారు. గ్రంథాలయాలను బలోపేతం చేసేందుకు దాతల సహకారం తీసుకుంటారు. ప్రతీ పాఠశాలలో అదే రోజు గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తారు.
- 11న విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలకు పిలిపించి పుస్తక పఠనంపై పిల్లలకు ఎలా అవగాహన కల్పించాలో చెబుతారు.
- 12, 13వ తేదీల్లో ప్రతీ పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఇతరుల నుంచి విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను సేకరించి గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతారు.
- 14న పఠన సామగ్రి అభివృద్ధి పర్చుకుంటారు. ఉదా: న్యూస్ పేపర్లలో వచ్చే పిల్లలకు సంబంధించిన అంశాలు కట్ చేసి అట్టలపై అతికిస్తారు.
- 15న గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పఠన పోటీలు నిర్వహిస్తారు. రివర్స్ రీడింగ్ చేయిస్తారు. విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోండి

సమస్యలు పరిష్కరించాలని, పలు డిమాండ్లతో మధ్యాహ్న భోజన కార్మికులు ఈనెల 10 నుంచి సమ్మెకు వెళ్తున్నారు. ఈనేపథ్యంలో పాఠశాలల్లో యథావిధిగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై హెచ్ఎంలు, ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ రాష్ట్రంలోని జిల్లా విద్యాశాఖ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మె నేపథ్యంలో విద్యార్థులకు యథావిధిగా భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈమేరకు డీఈఓ అబ్దుల్‌హై హెచ్ఎంలు, ఉపాధ్యాయులను ఆదేశించారు.

సమ్మెబాట పట్టిన పంచాయతీ ఉద్యోగులు

- సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుంది..
- పంచాయతీ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కోశాధికారి సదానందం



సమ్మె చేస్తున్న పంచాయతీ ఉద్యోగులు

హసన్‌పర్తి: గ్రామ పంచాయతీ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. గురువారం హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెకు పంచాయతీ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కోశాధికారి చాతళ్ల సదానందం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో తాత్కాలిక ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. సఫాయి కార్మికులకు నెలకు రూ.15,600, ఎలక్ట్రీషియన్, పంప్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, కారొబార్‌లకు నెలకు 19.500లు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని సదానందం తెలిపారు. సమ్మెలో గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా ఇన్‌చార్జ్ తగరం శివ, మండల అధ్యక్షుడు బండి రమేశ్, నాయకులు కుక్కమూడి నరేశ్‌కుమార్, రేణుక, రమేశ్, రవీందర్, ప్రభాకర్, కొమురయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లకు స్పాట్ కౌన్సెలింగ్

ఏటూరునాగారం: గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలోని గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో గిరిజన విద్యార్థులు ప్రవేశం పొందేందుకు ఈనెల 8న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన విద్యార్థులు ఏటూరునాగారం స్పోర్ట్స్ పాఠశాలలో ఉదయం 10 గంటలకు టెన్త్ మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్, కులం, ఆధార్, ఆదాయం, నివాసం, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలోలతో హాజరు కావాలన్నారు. అన్ని సర్టిఫికెట్లు ఉన్న విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్లు లభిస్తాయన్నారు. ఖాళీగా ఉన్న టీసీ, ఎస్సీ స్పోర్ట్స్ కోటలో ఆ విద్యార్థులతో అడ్మిషన్లు భర్తీ చేస్తామన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా.. సింగరేణి కార్మికుడి మృతి

భూపాలపల్లి అర్బన్: ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడి సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఏరియాలోని కేటీకే 5వ గనిలో పని చేస్తున్న కార్మికుడి తాటిపర్తి డానిల్ హనుకొండలో నివాసముంటున్నారు. వ్యక్తిగత పని మీద మంజూర్‌నగర్‌కు వచ్చి ఏరియా ఆస్పత్రి వైపు నుంచి భూపాలపల్లి వైపునకు నడుచుకుంటు వస్తున్నాడు. ఐరన్ రాడ్ లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ కూడా భూపాలపల్లి వైపునకు ప్రయాణిస్తోంది. ఈ క్రమంలో మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. పక్క నుంచి నడుచుకుంటు వెళ్తున్న డానిల్‌పై ట్రాలీలో ఉన్న ఐరన్ రాడ్లు పడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి ..

ఖానాపురం : మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బుధరావుపేటలో జరిగింది. ఎస్సై పిట్టల తిరుపతి కథనం ప్రకారం గ్రామానికి చెందిన షేక్ లతీఫ్(60) రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పటి నుంచి అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో పాటు ఒంటరితనంతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన.. బుధవారం రాత్రి రామలింగయ్యపల్లి సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కుమారుడు సుభాన్ ఘటనా స్థలికి చేరుకుని చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు సుభాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రధాని పర్యటన వేళ.. ట్రాఫిక్ మళ్లింపు

- సీపీ ఏవీ రంగనాథ్

కాజీపేట: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 8న వరంగల్ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ట్రైసిటీలో ట్రాఫిక్ మళ్లింపుతో పాటు పలు ఆంక్షలు అమలుచేయనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్, ఖమ్మం, హుజూరాబాద్, ములుగు ఆపై ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు కింద తెలిపిన విధంగా ఆయా మార్గాల్లో ప్రయాణించాలని సూచించారు. హుజూరాబాద్ వైపు నుంచి హైదరాబాద్, ఖమ్మం ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఓఆర్ఆర్ కరుణాపురం మీదుగా హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉంటుంది. కరుణాపురం, ఐనవోలు, పున్నేలు మీదుగా ఖమ్మంకు వెళ్లాలి.

- పరకాల, ములుగు మార్గాల నుంచి హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్ ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఓఆర్ఆర్ కరుణాపురం మీదుగా హైదరాబాద్ వెళ్లాల్సి ఉంటుంది. కరుణాపురం, ఐనవోలు, పున్నేలు మీదుగా ఖమ్మంకు వెళ్లాలి.
- నర్సంపేట ఆపై ప్రాంతాల నుంచి హైదరాబాద్, కరీంనగర్ వైపు వెళ్లే వాహనాలు వెంకట్రామ జంక్షన్, పోచమ్మ మైదాన్, దేశాయిపేట 80ఫీట్ రోడ్డు, ఆటో నగర్, హనుమాన్ జంక్షన్, పెద్దమ్మగడ్డ, కేయూజంక్షన్, చింతగట్టు ఓఆర్ఆర్ మీదగా వెళ్లాలి.
- వర్ధన్నపేట ఆపై మార్గాల నుంచి హైదరాబాద్, కరీంనగర్, ములుగు, పరకాల, భూపాలపల్లి వెళ్లే వాహనాలు పున్నేలు క్రాస్ రోడ్డు నుంచి డైవర్షన్ తీసుకుని ఐనవోలు, కరుణాపురం, ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాలి. అలాగే హైదరాబాద్, ఖమ్మం ఆపై మార్గాల నుంచి వచ్చే వాహనాలు పైన సూచించిన మార్గాల మీదుగా వారి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి ఉంటుంది.

సభకు వచ్చే వాహనాలకు సూచన..

- హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగే ప్రధానమంత్రి మోదీ బహిరంగసభకు వచ్చే వాహనాలు ఇలా రావాల్సి ఉంటుంది.
- హుజూరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలు కేయూసీ జంక్షన్, 100ఫీట్ రోడ్డుమీదుగా సెయింట్ పీటర్స్ ఫార్మసీ కాలేజీ, అంబేడ్కర్ భవన్, గోకుల్ జంక్షన్ మీదుగా సుబేదారి పోలీస్‌స్టేషన్ వద్ద ప్రజలను దించి ఇదే మార్గంలో ఖాళీ వాహనాల్లో తిరిగి వెళ్లి కేయూసీ ఎస్‌డీఎల్సీ మైదానంలో పార్క్ చేయాలి.
- పరకాల, భూపాలపల్లి, ములుగు నుంచి వచ్చే వాహనాలు పెద్దమ్మగడ్డ డైవర్షన్ నుంచి కేయూసీ జంక్షన్, 100 ఫీట్ రోడ్డు, సెయింట్ పీటర్స్ ఫార్మసీ కాలేజీ, అంబేడ్కర్ భవన్, గోకుల్ జంక్షన్ మీదుగా సుబేదారి పోలీస్‌స్టేషన్ వద్ద ప్రజలను దించి ఇదే మార్గంలో ఖాళీ వాహనాల్లో తిరిగి వెళ్లి కేయూసీ ఎస్‌డీఎల్సీ మైదానంలో పార్క్ చేయాలి.
- నర్సంపేట వైపు నుంచి వచ్చే వాహనాలు వెంకట్రామ జంక్షన్, పోచమ్మమైదాన్ మీదుగా పెద్దమ్మగడ్డ, కేయూ జంక్షన్, సెయింట్ పీటర్స్ ఫార్మసీ కాలేజీ, అంబేడ్కర్ భవన్, గోకుల్ జంక్షన్ మీదుగా సుబేదారి పోలీస్‌స్టేషన్ వద్ద ప్రజలను దించి ఇదే మార్గంలో ఖాళీ వాహనాల్లో తిరిగి వెళ్లి కేయూసీ ఎస్‌డీఎల్సీ మైదానంలో పార్క్ చేయాలి.
- ఈ మార్గాల నుంచి వాహనాలు ఉదయం 9గంటల లోపు సుబేదారి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. తర్వాత వచ్చే వాహనాలు కేయూసీ జంక్షన్ వరకు మాత్రమే అనుమతిస్తారు.
- వర్ధన్నపేట నుంచి వచ్చే వాహనాలు పున్నేలు క్రాస్ రోడ్డు, ఐనవోలు, కరుణాపురం, మడికొండ, కాజీపేట మీదుగా ఫాతిమా జంక్షన్ వద్ద ప్రజలను దించి ఖాళీ వాహనాలను సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ మైదానంలో పార్క్ చేయాలి.
- స్టేషన్ ఘన్‌పూర్ ఆపై మార్గాల నుంచి వచ్చే వాహనాలు కరుణాపురం, మడికొండ, కాజీపేట మీదుగా ఫాతిమా జంక్షన్ వద్ద ప్రజలను దించి ఖాళీ వాహనాలను సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ మైదానంలో పార్క్ చేయాలి.

ఈ ట్రాఫిక్ మళ్లింపు, ఆంక్షలు ఉదయం 4 నుంచి సాయంత్రం 5గంటల వరకు అమలులో ఉంటాయని సీపీ పేర్కొన్నారు.

ప్రధాని రాకకు శరవేగంగా ఏర్పాట్లు..

- మామునూరు విమానాశ్రయంలో నాలుగు హెలికాప్టర్లు ల్యాండింగ్
- పనులు పరిశీలించిన సంబంధిత అధికారులు
- హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే



విమానాశ్రయంలో సాగుతున్న రోడ్డు పనులు

మామునూరు: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వరంగల్ పర్యటన సందర్భంగా మామునూరు విమానాశ్రయంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రధాని మోదీ నేరుగా మామునూరుకు చేరుకోనున్నారు. ఇక్కడ నుంచి రోడ్డు మార్గంలో ప్రయాణిస్తూ శంకుస్థాపన, భద్రకాళి అమ్మవారి దర్శనం, సభ స్థలానికి చేసుకోనున్నారు. ప్రధాని వెంట నాలుగు హెలికాప్టర్లు రానున్నాయి. దీంతో ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండింగ్, రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపాదికన జరుగుతున్నాయి. గురువారం ఉదయం హెలికాప్టర్ (చాప్టర్)లో హైదరాబాద్ నుంచి ఎయిర్‌పోర్ట్ అథారిటీ, ఎస్‌పీజీ అధికారులు మామునూరుకు చేరుకున్నారు. భద్రత పరంగా నగరంతోపాటు విమానాశ్రయ పరిసరాలను పరిశీలిస్తూ ఏరియల్ సర్వే చేపట్టారు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ప్రావీణ్య ఎయిర్ పోర్ట్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సాయంత్రం లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పోలీస్ అధికారులు, మామునూరు ఏసీపీ కృపాకర్, ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, ఎస్సైలు కృష్ణవేణి, రాజేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైల్వే వ్యాగన్ పరిశ్రమ రాష్ట్రానికి తలమానికం

- జిల్లాలో పారిశ్రామిక రంగానికి బాటలు
- దక్షిణ మధ్య రైల్వే జీఎం ఏకే జైన్



రైల్వే వ్యాగన్ల తయారీ పరిశ్రమ మోడల్‌ను పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, తదితరులు

కాజీపేట రూరల్: కాజీపేటలో నిర్మించనున్న రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ యూనిట్ భారత రైల్వేలకే కాకుండా తెలంగాణ ప్రజలకు కూడా ప్రతిష్టాత్మ ప్రాజెక్ట్ అని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. కాజీపేట అయోధ్యపురం శివారులో గురువారం వ్యాగన్ స్థలాన్ని సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అయోధ్యపురంలో నిర్మించనున్న ఈ పరిశ్రమ తెలంగాణలో ఏర్పాటవుతున్న తొలి భారతీయ రైల్వే తయారీ యూనిట్ అని, ఇదీ ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కాజీపేటలో మొదట నెలకు 200 వ్యాగన్‌ల పిరాడికల్ ఓవరాలింగ్ (పీఓహెచ్) చేపట్టేందుకు వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ మంజూరైందన్నారు. ఈ నిర్మాణాన్ని రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) అప్పగించామన్నారు. ఆ తర్వాత రైల్వే వ్యాగన్ల అవసరాలు పెరగడం, స్థానిక పరిశ్రమను ప్రోత్సాహించడానికి కాజీపేటలో వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్‌ను సుమారు రూ.521 కోట్ల అంచనా వ్యయంతో రోబోటిక్ టెక్నాలజీతో రైల్వే వ్యాగన్ తయారీ యూనిట్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ మంజూరు, వ్యాగన్ తయారీ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగావకాశాలు రైల్వే బోర్డు నిబంధన ప్రకారం ఉంటాయన్నారు. వ్యాగన్ తయారీ పరిశ్రమలో సంవత్సరానికి 1200 వ్యాగన్లను, రెండో సంవత్సరం నుంచి సంవత్సరానికి 2,400 వ్యాగన్లను తయారు చేస్తుందన్నారు. కాగా, వ్యాగన్ల తయారీ యూనిట్ వివరాలను దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ డీఆర్‌ఎం ఎ.కె.గుప్తా, ఆర్‌వీఎన్‌ఎల్ సీపీఎం మున్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వ్యాగన్ ప్రత్యేకతలు

లేటెస్ట్ రోబోటిక్ టెక్నాలజీ, రోబోటిక్ పెయింటింగ్, ఆటోమెటిక్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఆపరేట్ సిస్టం, కంప్యూటరైజ్డ్ కంట్రోల్ మిషన్, కాలుష్య నివారణ, సోలర్ ప్యానెల్ వివిధ టెక్నాలజీ సిస్టంతో వ్యాగన్ పరిశ్రమ నిర్మితమవుతోంది.

టమాటాల చోరీపై విచారణ



కూరగాయల వ్యాపారిని విచారిస్తున్న పోలీసులు

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లోని కూరగాయల మార్కెట్‌లో టమాట, పచ్చి మిర్చి చోరీపై పోలీసులు గురువారం విచారణ చేపట్టారు. కూరగాయల మార్కెట్‌లో లక్‌పతి అనే వ్యాపారి దుకాణం నుంచి సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు టమాట, పచ్చిమిర్చి, చామగడ్డను చోరీ చేశారు. టమాటాల చోరీపై బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్త స్థానికంగా కలకలం రేపింది. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో టమాట చోరీపై విపరీతంగా ప్రచారం జరిగింది. దీనిపై స్పందించిన పోలీసులు వ్యాపారి లక్‌పతి నుంచి ఫిర్యాదు స్వీకరించి విచారణ చేపట్టారు.

పరిశ్రమల కేంద్రంగా కాజీపేట..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల



ఆర్ట్స్ కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న ఈటల రాజేందర్, ఇతర నాయకులు

- అసహనానికి గురై 'కమలం'పై కుట్ర
- బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొని నిలిచిన పార్టీ..బీజేపీ
- ప్రధాని సభను విజయవంతం చేయాలి
- పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

హన్మకొండ: రైల్వే సంబంధ తయారీ పరిశ్రమల కేంద్రంగా కాజీపేట అభివృద్ధి చెందనుందని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఈ నెల 8న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొనే బహిరంగ సభ ఏర్పాట్లను నాయకులతో కలిసి పరిశీలించారు. అంతకు ముందు ఇదే మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల కల వ్యాగన్ ఫ్యాక్టరీకి ఈ నెల 8వ తేదీన ప్రధాని మోదీ భూమి పూజ చేయనున్నారన్నారు. ప్రధాని మోదీకి ఈ ప్రాంత ప్రజలు ఘన స్వాగతం పలకాలన్నారు. పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రధాని సభకు బాధ్యులను నియమించారని, పార్టీ యంత్రాంగం ఆ పనిలో పూర్తిగా నిమగ్నమైందన్నారు. బీజేపీ ఎదుగుదలను ఓర్వలేక కుట్ర పన్నుతున్నారన్నారు. ప్రజలు ఆలోచించాలని, బీఆర్‌ఎస్‌కు ఎదురొడ్డి నిలిచిన పార్టీ బీజేపీ అన్నారు. నాలుగేళ్ల అయినా రుణమాఫీ ఎందుకు చేయలేదని, రైతులు మీద ఇష్టం లేకనా ? డబ్బు లేకనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పెన్షన్లు, జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ ప్రజల అవసరాలు తీరుస్తుందన్నారు. కేంద్రం అండ ఉంటే అన్నీ చేసే శక్తి వస్తుందన్నారు. 57 ఏళ్లకే పింఛన్ అందిస్తామని ఒంటరి మహిళలు, వితంతువులకు ఇస్తామన్నారు. ఎలాంటి ఆధారం లేక కేవలం పింఛన్ మీదే ఆధారపడి బతుకుతున్న దంపతులిద్దరికీ ఇస్తామన్నారు. ఏ రంగంలోనూ బీమా కవర్ కాని కూలీలు, పేదలందరికీ ఆ సౌకర్యం కల్పిస్తామన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ వి.మురళీధర్ గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు ఏనుగుల రాకేశ్ రెడ్డి, గుండె విజయరామారావు, మార్తినేని ధర్మారావు, పెసరు విజయ్‌చందర్ రెడ్డి, నరహరి వేణుగోపాల్ రెడ్డి, చందుపట్ల కీర్తి, వన్నాల శ్రీరాములు, గుజ్జ సత్యనారాయణ రావు, కొండి జితేందర్ రెడ్డి, గురుమూర్తి శివకుమార్, చాడ స్వాతి, బక్క నాగరాజు, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

సుభద్ర మృతదేహానికి రీ పోస్టుమార్టం

- రెండు వారాల్లో నివేదిక ఇస్తామన్న వైద్యులు



మృతురాలు సుభద్ర సమాధిని తవ్విస్తున్న వైద్యులు, అధికారులు

బచ్చన్నపేట : మండలంలోని సదాశివపేట గ్రామంలో పది నెలల క్రితం హత్యకు గురైన గుండని సుభద్ర సమాధి వద్ద వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ వైద్యులు ఆమె మృతదేహానికి గురువారం రీపోస్టుమార్టం నిర్వహించారు. తహసీల్దార్ గంగా భవాని సమక్షంలో, నర్మెట సీఐ నాగబాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించి కుటుంబ సభ్యుల సమక్షంలో సుభద్ర మృతదేహాన్ని పరీక్షించారు. అనంతరం అదే స్థానంలో మళ్లీ పూడ్చివేశారు. ఈ సందర్భంగా కేఎంసీ ఫోరెన్సిక్స్ వైద్యుడు ఖాజామొహినొద్దీన్ మాట్లాడుతూ గతంలో సుభద్ర మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అవయవాలు సేకరించామన్నారు. అవి ఆస్పత్రిలో భద్రపరిచామన్నారు. ప్రస్తుతం మృతదేహం ఫొటోలు మాత్రమే తీసుకున్నామన్నారు. ఈ నివేదికను రెండు వారాల్లో అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫోరెన్సిక్స్ వైద్యులు రాజ కాలిక్‌కాను, మౌనిక, ఎస్సైలు శ్రవణ్‌కుమార్, అనిల్‌కుమార్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు, కానిస్టేబుళ్లు , తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య
- వివరాలు వెల్లడించిన సీఐ బాలాజీ, ఎస్సై వెంకన్న



నిందితులు అఖిల, వంశీ

గార్ల: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే నెపంతో భార్య.. తన భర్తను హత్య చేయడానికి నిర్ణయించుకుంది. అనుకున్నదే తడువుగా ప్రియుడితో కలిసి ప్రణాళిక రూపొందించింది. దీనికి ప్రియుడు ఓ పథకం పన్నాడు. కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలిపి ఇచ్చాడు. దీనిని మూడో కంటికి తెలియకుండా మద్యం సేవించే సమయంలో భర్తకు ఇవ్వాలని చెప్పాడు. దీంతో ఆమె పథకం ప్రకారం ఆ కూల్‌డ్రింక్‌ను భర్తకు ఇవ్వగా సేవించిన ఆయన.. అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనలో భార్య, ప్రియుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గార్ల బయ్యారం సీఐ బాలాజీ, ఎస్సై వెంకన్న కథనం ప్రకారం గార్ల మండలం పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గూగులోత్ అరుణ్‌కుమార్(27)కు అఖిలతో 7 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. కాగా అఖిల.. అదే గ్రామానికి చెందిన నూనావత్ వంశీతో వివాహేతర సంబంధం నెరుపుతుంది. అయితే తమ బంధానికి అరుణ్‌కుమార్ అడ్డు వస్తున్నాడని.. ఇతనిని చంపి పెళ్లి చేసుకోవాలని అఖిల, వంశీ పథకం పన్నారు. ఈ క్రమంలో వంశీ 3 నెలల క్రితం కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలిపి అఖిలకు ఇచ్చాడు. భర్త మద్యం సేవించే సమయంలో కొద్దికొద్దిగా ఈ కూల్‌డ్రింక్ కలపాలని అఖిలకు సూచించాడు. దీంతో గత నెల 11వ తేదీన అరుణ్‌కుమార్ మద్యం సేవిస్తుండగా అఖిల 3 దఫాలుగా గడ్డిమందు కలిసిన కూల్‌డ్రింక్ ఇచ్చింది. దీనిని సేవించిన అనంతరం అరుణ్‌కుమార్ పొలం పనులకు వెళ్లి అక్కడే తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గత నెల 28వ తేదీన మృతిచెందాడు. దీనిపై తన కుమారుడి మరణంపై అనుమానం ఉందని, దీనికి కోడలు అఖిలే కారణమని మృతుడి తల్లి గత నెల 28న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు విచారించగా తన భర్త మృతికి తనతో పాటు వంశీ కారణమని అఖిల నేరం అంగీకరించింది. దీంతో అఖిల, వంశీని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం మహబూబాబాద్ కోర్టుకు తరలించినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

బావ దాడి చేసి.. పెద్దమనుషుల సమక్షంలో తిట్టాడని..

- బావమరిది బలవన్మరణం



భీముడు(ఫైల్)

నెల్లికుదురు: సొంత బావ తనపై దాడి చేయడంతోపాటు పెద్ద మనుషుల సమక్షంలో పరువు పోయేలా తిట్టాడని మనస్తాపానికి గురైన బావమరిది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం తారాసింగ్ బావితండాలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గుగులోతు భీముడు (43) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని తల్లిదండ్రులకు అదే తండాలో బావ భూక్య దేశిలాల్ ఇల్లు నిర్మిస్తున్నాడు. ఆ స్థలంలో ఇల్లు కట్టవద్దని భీముడు ఈ నెల 4న అడ్డుకోగా, బావ దేశిలాల్ అతనిపై దాడి చేశాడు. మరుసటి రోజుపెద్ద మనుషుల సమసక్షంలో పంచాయితీ పెట్టగా .. అక్కడ కూడా పరువు పోయే విధంగా తిట్టాడని మనస్తాపం చెందిన భీముడు 5న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సలహా మేరకు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతుడికి భార్య నీల, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైస్తవులపై దాడులు అమానుషం

- 'మోదీ గోబ్యాక్' నినాదంతో నిరసన తెలుపుదాం
- టీసీఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న క్రిస్టియన్, ముస్లిం పెద్దలు

హన్మకొండ చౌరస్తా: మణిపూర్‌లోని క్రైస్తవులపై భౌతికదాడులు అమానుషమని ముస్లిం, క్రిస్టియన్, ప్రజాసంఘాల బాధ్యులు మండిపడ్డారు. ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్(టీసీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం ' భారత్‌లో క్రిస్టియన్, మైనార్టీలపై దాడులు – ప్రజాస్వామ్య నిరసన' అనే అంశంపై హనుమకొండలోని అశోకా కాన్ఫరెన్స్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. మణిపూర్‌లో క్రిస్టియన్లపై భౌతికదాడులు జరుగుతుంటే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడం అప్రజాస్వామికమన్నారు. బీజేపీ సర్కార్ వైఖరిని ఎండగడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే కార్యక్రమంలో యువత, మేధావి, విద్యార్థులను భాగస్వామ్యులను చేయాలన్నారు. ఈనెల 8వ తేదీన ప్రధాని మోదీ వరంగల్ పర్యటన నేపథ్యంలో మోదీ గోబ్యాక్ అంటూ నినాదంతో నిరసన తెలపాలని ప్రజలను కోరారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా త్వరలో టీసీఎఫ్ ఆధ్వర్యంలో మతోన్మాదులకు బుద్ధి చెప్పేలా లక్షమంది క్రైస్తవులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ ఐజక్, కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా, జిలకర శ్రీనివాస్, కాలేబ్, తిరుణహరి శేషు, సాయిని నరేందర్, కన్నం సునీల్, ఉదయ్‌సింగ్, డాక్టర్ విజయ్‌కుమార్, ఇనాం జుబేర్ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ..

- ఒకరి మృతి
- ఇద్దరికి తీవ్రగాయాలు
- అంజనాపురంలో ఘటన




శ్రీనివాసరావు (ఫైల్)

గార్ల: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా.. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం మండలంలోని అంజనాపురం గ్రామ సమీపంలోని మలుపు వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గార్ల మండలం ముల్కనూరు జీపీలో నూతనపాటి శ్రీనివాసరావు (52) 25 సంవత్సరాల నుంచి విద్యుత్‌శాఖలో కాంట్రాక్ట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి స్వగ్రామం ఖమ్మం సమీపంలోని పొన్నెకల్లు. ఈ క్రమంలో మృతుడి భార్య ఉమ గురువారం ఉదయం గ్రామం నుంచి గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి గార్లలో దిగింది. అనంతరం శ్రీనివాసరావు, తన భార్య బైక్‌పై ముల్కనూరు వెళ్తున్నారు. ఈ క్రమంలో గార్లకు చెందిన బేతి అరవింద్‌కుమార్ బైక్‌పై మహబూబాబాద్ నుంచి వస్తూ అంజనాపురం సమీపంలో మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందగా, భార్య ఉమకు, అరవింద్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఖమ్మం, మహబూబాబాద్ ఆస్పత్రులకు తరలించారు. దీనిపై మృతుడి భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు. కాగా, మృతుడు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు పోయేవి కావని ఈ ప్రాంత రైతులు పేర్కొంటున్నారు. మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం, ఇన్సూరెన్స్ ఇప్పిస్తామని ఏఈ మహేంద్రబాబు తెలిపారు.

దేశానికి ఎన్‌సీసీ సేవలు అవసరం

- గ్రూప్ కమాండెంట్, కల్నల్ దూబే



మాట్లాడుతున్న గ్రూప్ కమాండెంట్, కల్నల్ దూబే

మామునూరు: ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు దేశ భద్రతకు ఎంతో అవసరమని, ఇందుకుగాను క్యాడెట్లు క్రమ శిక్షణతో కూడిన ప్రత్యేక శిక్షణను పూర్తి చేయాలని ఎన్‌సీసీ బెటాలియన్ గ్రూప్ కమాండెంట్, కల్నల్ హెచ్‌వీ దూబే సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీసు శిక్షణ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ టీఎస్ బెటాలియన్ వరంగల్ కమాండెంట్ కల్నల్ డీఎస్ రవత్ ఆధ్వర్యంలో ఈనెల 1నుంచి 10వ తేదీ వరకు జరగనున్న ఎన్‌సీసీ ప్రత్యేక శిక్షణ గురువారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ భద్రత విషయంలో క్యాడెట్ల సేవలను వినియోగించుకుంటామన్నారు. శిక్షణ ద్వారా క్యాడెట్లకు సేవాభావం, దేశభక్తి పెంపొందుతుందన్నారు. ఈ శిక్షణ లో రాణించిన క్యాడెట్లకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. సమావేశంలో కేఆర్ రెడ్డి, రణధీర్, శివకుమార్ పాల్గొన్నారు.

అమ్మకానికి ఆడశిశువు!

బారసాల బదులు బేరసారాలు
- పెంపకానికి భయపడి పొత్తిళ్లలోనే విక్రయాలు
- నెక్కొండ మండలంలో వరుస సంఘటనలు
- ఆందోళన కలిగిస్తున్న పరిస్థితులు

నర్సంపేట : పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారు. పలు సాహసకృత్యాల్లో రాణిస్తున్నారు. మరో పక్క లోకం చూడని పసికందులు అంగట్లో సరుకుగా మారుతున్నారు. అమ్మను గుర్తు పట్టేలోపే అమ్మకానికి ఒడిగడుతున్నారు. ఆర్థిక పరిస్థితులు లేదా అయిన వారి ఈసడింపులతోనో ఒత్తిళ్లకు లోనై పొత్తిళ్లలోనే పాపలను పరాయి తల్లులకు విక్రయిస్తున్నారు. బారసాల చేసి పేరు పెట్టాల్సిన తల్లిదండ్రులే పసికందుల బొడ్డు ఆరక ముందే బేరసారాలు చేస్తున్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో చోటు చేసుకున్న వరుస సంఘటనలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. మహిళల మనుగడను ప్రశ్నార్థంలోకి పడేస్తున్నాయి.

అంగన్‌వాడీ పరిశీలనలో అసలు గుట్టురట్టు..

నెక్కొండ మండలంలో శిశువు విక్రయ ఘటన అంగన్‌వాడీ సిబ్బంది పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. మండలంలోని నెక్కొండ తండాకు చెందిన బోడ అనూష జూన్ 24న వరంగల్ సీకేఎం ఆస్పత్రిలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. 28వ తేదీన ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లింది. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ సిబ్బంది బానోతు సరస్వతి 30వ తేదీన బాలింత అనూష, పసిపాపను పరిశీలించడానికి తండాకు చేరుకుంది. అయితే అనూష మాత్రమే ఉండడంతో ఆమె ఖిన్నురాలైంది. పాప గురించి ఆరా తీసింది. ఏమైందో చెప్పాలని నిలదీసింది. అప్పటికే అనూషకు ఒక బాబు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మళ్లీ ఆడశిశువే పుట్టడంతో వేరేవాళ్లకు ఇచ్చినట్లు అనూషతోపాటు ఆమె కుటుంబ సభ్యులు చెప్పారు. వారిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అంగన్‌వాడీ సరస్వతి.. విషయాన్ని ఐసీడీఎస్ అధికారులకు తెలిపింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తండాకు వెళ్లి వాస్తవ పరిస్థితులపై విచారణ చేపట్టారు. ముగ్గురు కుమార్తెలను పెంచడం కష్టమనే ఆలోచనతో వేరే వాళ్లకు విక్రయించినట్లు అంగీకరించి, తిరిగి తమ పాపను తెచ్చుకుంటామని పేర్కొనడం గమనార్హం.

నెక్కొండ తండా ఘటనపై పోలీసులకు ఫిర్యాదు..

నెక్కొండ తండాకు చెందిన అనూష తన పసికందును విక్రయించిన సంఘటనపై వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ తెలిపారు. వరంగల్ సీకేం ఆస్పత్రి కేంద్రంగా ఆడశిశువు విక్రయంలో గొర్రెకుంటకు చెందిన గుడిపాక కుమారస్వామి దంపతులు మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు వసుధ పేర్కొన్నారు. వారిని విచారిస్తే అసలు విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు.


నెక్కొండ తండాలో ఆడశిశువు విక్రయ ఘటన వివరాలు వెల్లడిస్తున్న అధికారులు (ఫైల్)

సోషల్ మీడియాతో వెలుగులోకి మరో ఘటన...

ఇదే నెక్కొండ మండలంలో మరో ఆడ శిశువు విక్రయించిన సంఘటన ఆలస్యంగా సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి రావడం విస్మయం కలిగిస్తోంది. మండలంలోని రెడ్లవాడ పరిధిలోని నాజీతండాకు చెందిన ఓ గర్భిణి మానుకోట ఏరియా ఆస్పత్రిలో జూన్ 3న ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అయితే, ఆ తల్లికి ఇంతకు ముందే ఒక కుమార్తె ఉంది. రెండో సంతానం కూడా ఆడ శిశువే కావడంతో చిన్నారిని విక్రయించాలనుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అదే తండాకు చెందిన ఒర్రె సహదేవుడు, భూక్య కస్నాతో విషయం చెప్పారు. హైదరాబాద్‌లో ఉంటున్న సహదేవుడు బంధువు ఒర్రె వెంకన్న సహాయంతో హైదరాబాద్‌లోనే ఉంటున్న స్టేషన్‌ఘన్‌పూర్ వాసి పరశురాం అనే వ్యక్తికి ఆ శిశువును విక్రయించినట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై బాలల పరిరక్షణ విభాగం అధికారులు విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

నంద్యాల తండాలో మరో ఘటన..

నెక్కొండ మండలంలోని బొల్లికొండ శివారు మాలోత్ నంద్యాల తండాకు చెందిన దంపతులకు 7-2-2020న ఆడ శిశువు జన్మించింది. ఆస్పత్రి సిబ్బంది, తండ్రి కలిసి ఏకంగా పుట్టిన మరుక్షణమే శిశువును తల్లిఒడికి దూరం చేశారు. 'సాక్షి'లో ప్రచురితమైన ప్రత్యేక కథనాలతో అదేనెల 17న అధికారులు విచారణ చేశారు. స్థానిక నర్సింగ్ హోం ఈ ఘటనకు సూత్రధారిగా వ్యవహరించింది.

విచారణ కాదు.. అవగాహన అవసరం..

జరిగిన సంఘటనలపై విచారణ చేపట్టడంతోపాటు గిరిజన ప్రాంతాల్లో ఆడశిశువుల విక్రయాలు చోటు చేసుకోకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒక పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్లల సంరక్షణ కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తుంటే.. అధిక సంతానంతో ఆడ శిశువులను విక్రయించడం అమానుషమని అంటున్నారు. సంఘటనలు జరిగిన సమయంలోనే స్పందించడం కాకుండా తరచూ గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచిస్తున్నారు. అంతే కాకుండా ప్రసూతి ఆస్పత్రుల వద్ద చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు. మరి.. నెక్కొండ మండల కేంద్రంలో వెలుగు చూసిన వరుస సంఘటనలపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారో.. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎలాంటి కార్యాచరణ రూపొందిస్తారో వేచి చూడాల్సిందే.

మోదీ సభకు తరలిరావాలి

- సినీ నటుడు, మాజీ మంత్రి బాబుమోహన్

పాలకుర్తి: భారత ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ పర్యటన సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని సినీ నటుడు, మాజీ మంత్రి బాబుమోహన్ కోరారు. గురువారం పాలకుర్తిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేటాయిస్తున్నవి కేవలం రూపాయలేనని, ప్రధాని ఇస్తున్నవి వేల కోట్లు అని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, నాయకులు పానుగంటి పాపారావు, పెద్దగాని సోమయ్య, పూసాల శ్రీమాన్, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, దొంగరి మహేందర్, దుబ్బ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బాబుమోహన్

క్వారీల్లో అధికారుల తనిఖీలు

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ బృందావన్ కాలనీ సమీపంలోని గ్రానైట్ క్వారీలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ సురేఖ గురువారం పరిశీలించారు. క్వారీల నిర్వహణతో దుమ్మూ, ధూళి ఎగిసిపడుతోందని, దాంతో అనారోగ్యాల బారిన పడుతున్నట్లు కాలనీవాసులు డీఈకి ఫిర్యాదు చేయగా ఆమె తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా క్వారీ యజమానులతో మాట్లాడి తగు న్యాయం జరిగేలా చూస్తామంటూ కాలనీవాసులకు ఏఈ హామీ ఇచ్చారు. కాలనీ గౌరవ సలహాదారుడు సోని, రాంచందర్, భద్రయ్య, రవీందర్, భారతి, కరుణ పాల్గొన్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ సురేఖ

ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన అవసరం

హన్మకొండ: పోష్టికాహార లోపాలతో బాధపడుతున్న పిల్లలు, బలహీన వర్గాలు, మహిళలకు మేలు చేసే సూక్ష్మ పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ రైస్ ఉపయోగాలను వారికి అవగాహన కల్పించాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్, సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం అమలుపై సంబంధిత అధికారులు, సంస్థలకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈమేరకు క్యాట్కో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌లాల్ చౌరాసియా, సంయుక్త కార్యదర్శి కొంతం వీరస్వామితో కలిసి హైదరాబాద్‌లో ఆహార కల్తీ నిరోధక శాఖ డైరెక్టర్ డాక్టర్ శివలీలకు దామోదర్, చక్రపాణి గురువారం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్ టి.విజయకుమార్ పాల్గొన్నారు.


శివలీలకు వినతిపత్రం అందజేస్తున్న వినియోగదారుల సంఘాల ప్రతినిధులు

జూనోటిక్ వ్యాధిపై జాగ్రత్త

హన్మకొండ: జంతువులు, పశువులు, పక్షుల నుంచి మనుషులకు వ్యాప్తి చెందే జూనోటిక్ వ్యాధిపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హనుమకొండ జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ సూచించారు. జూనోటిక్ డేను పురస్కరించుకుని హనుమకొండ వడ్డెపల్లి ప్రాథమిక పశు వైద్యశాలలో పశు వైద్యాధికారి డాక్టర్ సీహెచ్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకటనారాయణ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించి శునకాలకు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుక్కకాటు వలన సంభవించే రేబిస్ వ్యాధికి టీకాను 1885, జులై 6న ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ కనుగొన్నారని వివరించారు. అప్పటి నుంచి జులై 6ను జూనోటిక్ డేగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 129 కుక్కలకు టీకాలు వేశారు. పశు వైద్య, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాస్, పశు వైద్య కళాశాలలో ఇంటర్న్‌షిప్ ట్రైనింగ్ విద్యార్థులు శిరీష, దివ్యజ్యోతి, అపూర్వ, సిబ్బంది రాకేష్, కొమురయ్య, యాదలక్ష్మి, రాకేష్ పాల్గొన్నారు.


రేబిస్ నివారణ టీకా వేస్తున్న వెంకటనారాయణ

ఇల్లు అమ్మేశాడు.. కూల్చేశాడు !

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసిన కొనుగోలుదారుడు

మరిపెడ రూరల్: ఓ వ్యక్తి తన ఇంటిని మరొకరి విక్రయించాడు.. కొనుగోలు చేసిన వ్యక్తి వచ్చి ఇల్లు ఖాళీ చేయాలని కోరడంతో ఆగ్రహించిన మాజీ యజమాని ఆ ఇల్లును కూల్చేశాడు. ఘటనకు స్థాని కులు, బాధితుడు తేజావత్ రాజరాం నాయక్ తెలిపి న వివరాల ప్రకారం.. మండలంలోని కోట్యతండా గ్రామ పంచాయతీకి చెందిన తేజావత్ శ్రీను వద్ద అదే తండాకు చెందిన తేజావత్ రాజరాం ఈ ఏడాది మే 8న ఇల్లు(స్లాబు)ను రూ.1.21లక్షలకు తండా పెద్ద మనుషుల సమక్షంలో కొనుగోలు చేశాడు. దీనికి సంబంధించి మొత్తం డబ్బులు కూడా చెల్లించాడు. అయినప్పటికీ ఇల్లు విక్రయించిన తేజావత్ శ్రీను ఇంటిని ఖాళీ చేయడం లేదు. దీంతో విసుగుచెందిన రాజరాం జూన్ 27న మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ఇల్లు ఖాళీ చేయాలని శ్రీనును హెచ్చరించారు. దీంతో తీవ్ర ఆవేశానికి లోనైన శ్రీను నా మీదనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా.. అని, తాను విక్రయించిన ఇంటిని కూల్చి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఇంటిని కూల్చిన వ్యక్తితోపా టు అతనికి సహకరించిన తండాలోని మరికొందరిపై కఠిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితుడు రాజారాం వేడుకుంటున్నాడు. ఈ విషయంపై మరిపెడ పోలీసులకు మరోసారి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు రాజరాం తెలిపాడు.


కోట్యతండాలో కూల్చిన ఇల్లు

అక్రమ కేసులు పెట్టిన వారిపై చర్య తీసుకోవాలి

- మాకు ఏమైనా జరిగితే కడియం, ఆయన అనుచరులదే బాధ్యత
- రైతు దంపతుల ఆవేదన

స్టేషన్‌ఘన్‌పూర్: పాంనూర్ గ్రామంలోని తన పట్టా భూమి నుంచి అక్రమంగా దారి తీయడమే కాకుండా.. తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్య తీసుకోవాలని జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం కొత్తపల్లికి చెందిన సోమిరెడ్డి, ఆయన భార్య సరళాదేవి కోరారు. ఈ మేరకు వారు గురువారం కొత్తపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. పాంనూర్‌లో 2010 సంవత్సరం పట్టా భూమి కొనుగోలు చేసి 2012లో ఎంసీతో సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. ఆ గ్రామానికి చెందిన కొందరు తమ భూమి నుంచి బాట తీయడంతో పది గుంటల భూమి కోల్పోవాల్సి వచ్చిందని, ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టామని తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు బాట విషయమై ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తనతోపాటు విదేశాల్లో ఉన్న కుమారుడిపై కేసులు పెట్టారని పేర్కొన్నారు. ఇటీవల పంటలు సాగు చేసేందుకు మడులు ఏర్పాటు చేయగా.. పాంనూర్ సర్పంచ్ భర్త కోతి రాములు తదితరులు ఎమ్మెల్సీ కడియం వద్దకు వెళ్లి పోలీసులకు ఫోన్ చేయించగా.. ఈనెల 3న సీఐ తనను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మందలించడంతోపాటు ఏసీపీ ఇష్టారాజ్యంగా దుర్భాషలాడారని తెలిపారు. తాము చెప్పేది వినకుండా కేసు నమోదు చేసి అకారణంగా జైలుకు పంపి పరువు తీశారని వాపోయారు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కొందరి మాటలు విని తనపై కేసు పెట్టించడం భావ్యం కాదన్నారు. మాకు ఏమైనా జరిగితే కడియం శ్రీహరి, అతని అనుచరులే బాధ్యత వహించాలని, కోతి రాములు, కోతి భిక్షపతి ఉద్దేశపూర్వకంగా ఇలా చేయించారని రైతు దంపతులు అన్నారు.


మాట్లాడుతున్న రైతు సోమిరెడ్డి దంపతులు

'ప్రధాని మోదీ గో బ్యాక్'..

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సహకరించని, రాష్ట్ర విభజన చట్టంలోని హామీలు అమలు చేయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నగరానికి రావొద్దని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, బీసీ స్టడీ ఫోరం చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ ఆసరాలు, హామీలు తీర్చలేని ప్రధాని ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించే నైతిక అర్హత లేదని అన్నారు. దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళిత, ఆదివాసీ, మైనారిటీలు, స్త్రీలు, మహిళా రెజ్లర్లపై దాడులను అరికట్టక పోగా, కనీసం స్పందించని మోదీకి పోరుగడ్డ తెలంగాణ మీద అడుగుపెట్టే అర్హత లేదని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ పర్యటనను ప్రజలు నిరసిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీసీకే పార్టీ, ప్రజా సంఘాల నాయకులు మచ్చ దేవేందర్, అంబాల అనిల్, శనిగరం మహేష్, కన్నాల రవి, కన్నం సునీల్, దరిగి ధన్‌రాజ్, వేల్పుల శంకర్, జె.జె.స్వామి, ఎగ్గడి సుందర్ రామ్, సింగారపు అరుణ, శ్రీవాణి, పగిడిపాటి అనూష పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

అద్దె చెల్లించరు.. నిబంధనలు పాటించరు

- ఎంజీఎం ప్రాంగణంలో విచ్చలవిడిగా దుకాణ సముదాయాలు
- నాసిరకం వస్తువుల విక్రయాలు

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సౌకర్యార్థం నిబంధనలతో ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాల నిర్వహణ విచ్చలవిడిగా మారింది. ఎంజీఎం ఆస్పత్రిలో నిత్యం 800 నుంచి వెయ్యి మందికిపైగా రోగులు (ఇన్‌పేషెంట్) అడ్మిట్ అవుతూ.. చికిత్స పొందుతూ ఉంటారు. రోగులకు చేదోడు వాదోడుగా ఉండేందుకు రోగుల అటెండెంట్లు సైతం ఆస్పత్రిలో ఉంటారు. ఇలా.. నిత్యం రెండు నుంచి మూడు వేల మంది వరకు ఆస్పత్రికి వస్తూ పోతూ ఉంటారు. వీరి సౌకర్యార్థం ప్రభుత్వం, రాష్ట్ర, జిల్లా అధికారులు ఆస్పత్రి ప్రాంగణంలో కొన్ని దుకాణ సముదాయాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. ఆస్పత్రిలో దుకాణ సముదాయం ఏర్పాటు చేసుకునే సమయంలో అద్దె ఎంత? విక్రయించే వస్తువుల్లో నాణ్యమైన వస్తువులే విక్రయిస్తామని, నిబంధనలు పాటిస్తామని స్పష్టంగా పేర్కొన్నారు. అనంతరం ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో అనుమతులతో కూడిన దుకాణ సముదాయాలు ఏర్పాటు చేశారు. కానీ కొన్ని నెలలుగా అసలు నిబంధనలు పాటించట్లేదు. ఆస్పత్రి అభివృద్ధికి వారు ఒప్పుకున్న అద్దె సైతం కేటాయించకపోవడం గమనార్హం.


ఎంజీఎంలో విచ్చలవిడిగా దుకాణ సముదాయాలు

నిబంధనలు తుంగలో తొక్కుతూ..

ఎంజీఎంలో ఓపీ విభాగంతో పాటు, క్యాజువాలిటీ ప్రాంతంలో జనరిక్ ఫార్మసీలు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నీళ్ల దుకాణ సముదాయాలు, ఫుడ్ క్యాంటీన్లతో పాటు ఇతర వస్తువులను విక్రయించే షాపులను కలెక్టర్ అనుమతితో నెలకొల్పారు. ఈదుకాణ సముదాయాలను ప్రజాప్రతినిధుల పైరవీల చేత అనుమతులు పొందిన సదరు నిర్వాహకులు సొంతంగా నిర్వహించకుండా.. ఆస్పత్రిలో సైతం మరొకరికి అద్దెకు కేటాయింపులు చేస్తూ.. ఆస్పత్రికి అద్దె చెల్లించకుండా షాపుల నిర్వహణ సాగిస్తున్నారు. నిబంధనల మేరకు నాణ్యమైన వస్తువులు విక్రయించకుండా నాసిరకానివి విక్రయిస్తూ రోగులు, వారి బంధుమిత్రుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

అద్దె సైతం సక్రమంగా చెల్లించరు

ఎంజీఎం ఆస్పత్రిలో 14 నుంచి 18 వరకు దుకాణ సముదాయాల నిర్వహణ సాగుతోంది. వీరు ప్రతీ నెల అద్దె చెల్లించాల్సి ఉంటుంది. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆస్పత్రి అభివృద్ధి కోసం ఉపయోగిస్తారు. కాగా.. కొంత కాలంగా వీటి ద్వారా ఎన్ని నిధులు వస్తున్నాయి? వీటి నిర్వహణ సక్రమంగా ఉందా లేదా? అనే విషయాన్ని అధికారులు విస్మరించారు. కొన్ని నెలలుగా ఈదుకాణ సముదాయాల అద్దె పెండింగ్‌లో ఉంది. ఈవిషయంపై ఎంజీఎం పరిపాలనాధికారులను వివరణ కోరగా.. దుకాణ సముదాయాల నిర్వాహకులకు నోటీసులిచ్చామని, పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం నిర్వహించేలా, అద్దె చెల్లించేలా చర్యలు చేపడతామని తెలిపారు.

గ్రాంటు సగమే విడుదల

- జిల్లాలో స్కూళ్లకు సంబంధించి రూ.57,35,500
- స్పోర్ట్స్‌కు రూ.15,77,500 మాత్రమే

విద్యారణ్యపురి: ఈవిద్యాసంవత్సరంలో ప్రభుత్వం పాఠశాలలకు, స్పోర్ట్స్‌కు కేవలం 50 శాతం మాత్రమే గ్రాంటును విడుదల చేసింది. హనుమకొండ జిల్లాకు 50 శాతం ఆయా నిధులు పాఠశాలల్లోని ఎస్ఎంసీ అకౌంట్లలో జమ చేసింది. జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి 449 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా నిధులను విడుదల చేశారు. ఒకటి నుంచి 30 మంది విద్యార్థులుంటే రూ.10వేలు రావాల్సి ఉండగా.. రూ.5 వేలు, 31 నుంచి 100 మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.25 వేలు రావాల్సి ఉండగా.. 12,500, 101 మంది నుంచి 250 మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.50 వేలు రావాల్సి ఉండగా.. రూ.25 వేలు, 251 నుంచి 1000 మంది ఉన్న పాఠశాలలకు రూ.75 వేలు రావాల్సి ఉండగా.. రూ.37,500ల చొప్పున ఆయా పాఠశాలలకు విడుదల చేశారు. మొత్తం జిల్లాకు రూ.57,35,500లు గ్రాంటు విడుదలైంది. ఆయా స్కూళ్ల గ్రాంటు నిధులతో స్టేషనరీ, మైనర్ రిపేర్లు, ఎలక్ట్రిక్ డివైస్ వ్యయం, టీఎల్ఎం మెటీరియల్ చాక్‌పీస్ తదితర ఖర్చులకు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

స్పోర్ట్స్‌కూ సగమే..

హనుమకొండ జిల్లాలోని 449 ప్రభుత్వ పాఠశాలలకు స్పోర్ట్స్‌గ్రాంటు రూ. 15,77,500 విడుదలయ్యాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు రూ. 5 వేలు రావాల్సి ఉండగా.. రూ 2,599ల చొప్పున, యూపీఎస్‌లకు, ఉన్నత పాఠశాలలకు రూ.10 వేల చొప్పున రావాల్సి ఉండగా.. రూ 5వేల చొప్పున విడుదల చేశారు. కాగా ఆయా నిధులను పాఠశాలల ఎస్ఎంసీల అకౌంట్‌లోకి విడుదల చేశారు. ఆయా నిధులతో పాఠశాలల విద్యార్థుల కోసం క్రీడా పరికరాలు కొనేందుకు వినియోగించుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి కలిగించాల్సి ఉంటుంది.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జనగామ రూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం మండలంలోని పెంబర్తిలో జరిగింది. స్టేషన్ ఘన్‌పూర్ మండలం ఛాగల్‌కు చెందిన చౌదార్‌పల్లి కుమార స్వామి (37) వ్యవసాయంతోపాటు డ్రైవింగ్ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై భార్య డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు కుమారస్వామికి కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన.. పెంబర్తి బీసీ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న తన పెద్దకుమార్తె వద్దకు వెళ్లి కలిశాడు. అనంతరం పెంబర్తి హైవే వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడికి ఇద్దరు కుతూళ్లు, కుమారుడు, భార్య ఉమ రాణి ఉంది.


కుమార స్వామి (ఫైల్)

యువత.. దేశ ఔన్నత్యాన్ని కాపాడే వనరు

- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- ఘనంగా 'యువ ఉత్సవ్'

హన్మకొండ అర్బన్: 'నేటి యువత దేశ ఔన్నత్యాన్ని కాపాడే గొప్ప వనరు' అని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. వరంగల్ నెహ్రూ యువ కేంద్ర, యువజన వ్యవహారాలు, భారత క్రీడా మంత్రిత్వ శాఖ సౌజన్యంతో అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గురువారం నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి 'యువ ఉత్సవ్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎంపీ పసునూరి దయాకర్ హాజరయ్యారు. ఈసందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. యువతపైనే దేశ భవిత ఆధారపడి ఉందన్నారు. ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ.. తాను కూడా ఒక కళాకారుడినేనని, తన కళే తనను ఎంపీ స్థానంలో నిలబెట్టిందన్నారు. కళాకారులు సైతం తమ ప్రతిభకు పదును పెట్టి ఉన్నత స్థానంలో నిలవాలని కోరారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ముఖ్య అతిథులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జిల్లా స్థాయిలో యువతకు నిర్వహించిన సాంస్కృతిక, వక్తృత్వ, పెయింటింగ్, పద్య రచన, మొబైల్ ఫోటోగ్రఫీ పోటీ విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. విజేతలు రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొననున్నారు. ఈసందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన ఆటాపాటలు అలరించాయి. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌కుమార్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్, కేయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఈసం నారాయణ, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం హరిప్రసాద్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ స్వప్న మాధురి, పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రాధిక, రాజేశ్వరి, మంగమ్మ, ప్రోగ్రాం ఆర్గనైజర్లు శ్రీకాంత్, జాతీయ యువజన అవార్డు గ్రహీతలు ఆకులపెల్లి మధు, మహ్మద్ అజాం, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

బీసీ రిజర్వేషన్ పకడ్బందీగా అమలు చేయాలి

- బీసీ సంక్షేమ కమిటీ చైర్మన్ అంజయ్య

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వ ఉద్యోగాలలో బీసీ రిజర్వేషన్లను పకడ్బందీగా అమలుచేయాలని బీసీ సంక్షేమ కమిటీ చైర్మన్ అంజయ్య అన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై గురువారం జిల్లాకేంద్రంలోని ఇల్లందు క్లబ్‌హౌస్‌లో కమిషన్ సభ్యులు, ఎమ్మెల్సీ వై.మల్లేశంతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖ పరిధిలో వెనుకబడిన తరగతులకు సంబంధించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నియమాల ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్లు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వెనుకబడిన తరగతులకు సంబంధించి రోస్టర్ పాయింట్లను సక్రమంగా నిర్వహిస్తున్నామని ఈఎంసీ వెంకటేశ్వర్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు వివరాలను అధికారులు వివరించారు. బీసీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టు అధికారి నల్లా వెంకటేశ్వరరావు, రామగుండం సబ్ ఇంజనీర్ కరుణాకర్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మహదేవపూర్ ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి శైలజ, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన..

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామిని తెలంగాణ బీసీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య, ఎమ్మెల్సీ మల్లేశం, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద వారికి అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. వారికి శ్రీ శుభానందదేవి అమ్మవారి ఆలయంలో పూజలు చేసిన అనంతరం ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి శాలువాలతో సన్మానించారు. అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీపంపుహౌస్ వద్ద ఎత్తిపోతలను, లక్ష్మీబ్యారేజీని రామగుండం ఎమ్మెల్యే చందర్‌తో కలిసి సందర్శించారు. వారికి ఈఎన్‌సీ ప్రాజెక్టు స్వరూపాన్ని వివరించారు. వారి వెంట ఈఈ తిరుపతిరావు, డీఈఈ సురేష్, ఎస్సై భవానిసేన్ ఉన్నారు.


భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న అంజయ్య